
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

**DECEMBER 2007**

సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్త వార్తలు

2007 అక్టోబరు 1వ తేదీ సోమవారం ముమ్మిడివరం మండలం గున్నేవల్లిలో జరిగిన సువార్త కూటములో రిక్కీగూటంగారు వాక్యపరిచర్యచేసిరి. అనేక మంది హైందవులు హాజరై దేవుని వాక్యమును వినిరి. గున్నేవల్లిలో సోదరులు టి.యోసేపు రాజుగారు సువార్త చాటుచున్నారు.

అక్టోబరు 4వ తేదీ గురువారం పిఠాపురం జగ్గయ్య చెరువులో జరిగిన సువార్త కూటములో రిక్కీగారు వాక్యపరిచర్య చేసిరి. జగ్గయ్య చెరువు క్రీస్తుసంఘమునకు ఒక కుట్టుమిషన్‌ను బహూకరించిరి. తద్వారా అక్కడ నున్న సోదరీలు కుట్టుపని నేర్చుకొను అవకాశం కల్పించిరి. జగ్గయ్య చెరువులోను, యానాదుల కోలనీలోను సోదరులు పెయ్యల సత్యానందంగారు సువార్త చాటుచున్నారు.

అక్టోబరు 9వ తేదీ మంగళవారం అన్నవరం మండలం బెండపూడిలో జరిగిన కూటములో రిక్కీగారు వాక్యపరిచర్య చేసిరి. స్థానికులు ఆత్మీయముగా బలపడిరి. అక్కడ సోదరులు పులగల సమర్పణరావ్‌గారు సువార్త చాటుచున్నారు.

అక్టోబరు 14వ తేదీ ఆదివారం హైదరాబాద్ మల్లాపూర్‌లో యున్న క్రీస్తుసంఘములో రిక్కీగారు ఆరాధన సమయంలో వాక్యోపదేశము చేసిరి. అక్కడ వందనం మేడిసన్‌గారు క్రీస్తుకొరకు శ్రమించుచున్నారు.

అక్టోబరు 15 నుండి 18 వరకు రిక్కీగారు, రాబిన్ గూటంగారు, రాజ విజయ కుమార్‌గారు, శ్రీశైలం,నాగార్జునసాగర్ ప్రాంతములు దర్శించి సహోదరులను హెచ్చరించిరి.

అక్టోబరు 23వ తేదీ మంగళవారం, బొమ్మూరు మండలం రాజవోలులో జరిగిన సువార్త కూటములో సోదరులు రిక్కీగూటం గారు వాక్యపరిచర్య చేసిరి. కూటమునకు అనేకులు హాజరై గొప్ప ఆత్మీయనుభూతిని పొందిరి.రాజవోలులో సోదరులు యమ్. యేసుపాదంగారు సువార్త పని చేయుచున్నారు. (మిగతా టైటిలు 3వ పేజీలో)

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 28 | డిశంబర్ 2007 | సంచిక 5

## మానవుని తత్వము - 1

(The Nature of Man - 1)

బైబిలులో కీర్తనలు గ్రంథములో దావీదు మహారాజు ఇట్లు వ్రాసాడు. "యెహోవా, మా ప్రభువా, ఆకాశములలో నీ మహిమను కనుపరచువాడా, భూమి యందంతట నీ నామము ఎంత ప్రభావము గలది! ..... నీవు కలుగ జేసిన చంద్ర నక్షత్రములను నేను చూడగా నీవు మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు వాడేపాటి వాడు? నీవు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటివాడు? దేవుని కంటె వానిని కొంచెము తక్కువ వానిగా చేసియున్నావు. మహిమా ప్రభావములతో వానికి అధికారమిచ్చి యున్నావు. గొర్రెలనన్నిటిని ఎడ్లనన్నిటిని అడవి మృగములను ఆకాశపక్షులను సముద్ర మత్స్యములను సముద్ర మార్గములలో సంచరించు వాటినన్నిటిని వాని పాదముల క్రింద ఉంచి యున్నావు. యెహోవా మా ప్రభువా, భూమియందంతట నీ నామము ఎంత ప్రభావము గలది! (కీర్త 8:1-9).

మరల కీర్తన 139:14-17లో

అతడిట్లు చెప్పాడు: "నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి. అందును బట్టి నేను నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాను. నీ కార్యములు ఆశ్చర్యకరములు. ఆ సంగతి నాకు బాగుగా తెలిసియున్నది. నేను రహస్యమందు పుట్టిన నాడు, భూమి యొక్క అగాధ స్థలములలో విచిత్రముగా నిర్మింపబడిననాడు, నాకు కలిగిన యెముకలును నీకు మరగై యుండలేదు. నేను పిండమునై యుండగా నీ కన్నులు నన్ను చూచెను. నియమింపబడిన దినములలో ఒకటైన కాకమునుపే, నా దినములన్నియు నీ గ్రంథములో లిఖితము లాయెను!". ఈ రీతిగ మానవుని తత్వాన్ని గూర్చి తన తలంపులను వ్యక్తపర్చుచు దావీదు మహారాజు దేవుని కొనియాడాడు.

## మానవుడుదేవునిచే సృజింపబడిన వ్యక్తి

"దేవుడు-మన స్వరూపమందు, మన పోలిక చొప్పున నరులను చేయుదుము.... దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీని గాను పురుషుని గాను వారిని సృజించెను" అని బైబిలు చెప్పుచున్నది (అది.కా. 1:26-27). మరియు "దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" (అది.కా. 2:7).

"మరియు దేవుడైన యెహోవా- నరుడు ఒంటరిగా నుండుట మంచిదికాదు; వానికి సాటియైన సహాయమును వానికొరకు చేయుదునను కొనెను". "అప్పుడు దేవుడైన యెహోవా ఆదామునకు గాఢనిద్ర కలుగజేసి అతడు నిద్రించినప్పుడు అతని ప్రక్కటెముకలలో ఒకదానిని తీసి ఆ చోటను మాంసముతో పూడ్చివేసెను. తరువాత దేవుడైన యెహోవా తాను ఆదాము[illegible] తీసిన ప్రక్కటెముకను స్త్రీనిగా [illegible] ఆమెను ఆదామునొద్దకు తీసికొని వచ్చెను. అప్పుడు ఆదాము యిట్లనెను-నా యెముకలలో ఒక యెముక, నా మాంసములో మాంసము, ఇది నరునిలో నుండి తీయబడెను గనుక నారి అనబడును" (ఆది.కా. 2:18; 21-23).

అపొస్తలుడైన పౌలు ఇట్లు చెప్పాడు: "జగత్తును అందలి సమస్తమును నిర్మించిన దేవుడు తానే ఆకాశమునకును భూమికిని ప్రభువై యున్నందున హస్తకృతములైన ఆలయములలో నివసింపడు. ఆయన అందరికిని

జీవమును, ఊపిరిని సమస్తమును దయచేయువాడు గనుక తనకు ఏదైన కొదువయున్నట్లు మనష్యుల చేతులతో సేవింపబడువాడుకాడు. మరియు యావద్భూమి మీద కాపురముండుటకు ఆయన యొకని నుండి ప్రతిజాతి మనుష్యులను సృష్టించి , వారు ఒకవేళ దేవుని తడవులాడి కనుగొందురేమో యని, తన్నువెదకు నిమిత్తము నిర్ణయకాలమును వారి నివాస స్థలము యొక్క పొలిమేరలను ఏర్పరచెను. ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడుకాడు. మనమాయున యందు బ్రదుకుచున్నాము చలించు చున్నాము,ఉనికి కలిగియున్నాము" (అపొ.కా. 17:24-28).

ఇట్టిరీతిగా మానవుడు భూమిపై ఉనికిని కలిగియున్నాడు. మానవుడు జీవముగల వ్యక్తి. ఆశ్చర్యకరమైన వ్యక్తి. దేవునిచే సృజింపబడిన వ్యక్తి

## మానవుడు వివేక విశిష్టమైన వ్యక్తి

Man is a rational being. మానవుని వివేక విశిష్టతను (Rotionality) గూర్చి బైబిలు బోధించుచున్నది. మానవుడు యోచించడానికి, ఆలోచించడానికి, గ్రహించడానికి, సంకల్పించడానికి, ఇచ్ఛయించడానికి, నిశ్చయించడానికి, అంచనావేయడానికి, నిరీక్షించడానికి, జ్ఞప్తియుంచుకొనడానికి, సాధించడానికి శక్తిగలవాడు. యివన్నియు మానవ మేధస్సు యొక్క లక్షణములు. యిట్టి లక్షణముల వలన అతడు జంతు జాతినుండి వేరైనవాడు. మానవుడు వివేక విశిష్ట బుద్ధిగలవాడు గనుక అతడు దేవునితో సహవాసము కోరును. అతని ఈ వివేక విశిష్ట మేధస్సును ఉద్దేశించి దేవుడు మాట్లాడును. అందువలన దేవుని మనస్సును లేదా చిత్తాన్ని ప్రతి మానవుడు తెలిసికోవాలి, పఠించి తెలిసికోవాలని దేవుడు కోరుచున్నారు. మనం దేవుని గూర్చి నేర్చుకోవాలి, తెలిసికోవాలి,యితరులకు బోధించాలి. యిది మన కర్తవ్యం. మనము "సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టుకొనాలి" (1థెస్స 5:21). జంతువులకు కాదుగాని మానవునికి మాత్రమే ప్రార్థించే తరుణాన్ని, అంటే దేవునితో సంభాషించే తరుణాన్ని దేవుడు అనుగ్రహించాడు. యిది మానవుని బుద్ధి జ్ఞానములలో ఇమిడియున్న సదవకాశము.

## మానవుడు నైతిక స్వేచ్ఛగలవాడు

దేవుడు మానవుని ఒక మరమనిషి (Robot) లాగ చేయలేదుగాని నైతిక స్వేచ్ఛగలవానిగా చేసెను. అదికాండము

3వ అధ్యాయములో ఆదాము హవ్వలు తమ స్వయం నిర్ణయముచొప్పున దేవుడు నిషేధించిన ఫలములను తిని ఈ లోకములోనికి పాపాన్ని తెచ్చారు. దేవుని మాటలకు లోబడుటకు, లోబడకుండుటకు వారు స్వేచ్ఛకలిగి యుండిరి. వారాయన మాటలకు అవిధేయత చూపుటకు నిశ్చయించుకొన్నారు. గనుక పాపములో పడ్డారు. తత్ఫలితాన్ని అనుభవించారు.

మానవుని వివేక విశిష్టతలో అతని నైతిక ఉనికి మిళితమై యున్నది. అతడు మంచి చెడుల విచక్షణ కలిగియున్నాడు. దేవుని చిత్తాన్ని జరిగించుటలో కలిగే ఆనందాన్ని, జరిగించక పోవడంలో యున్న దుఃఖాన్ని అతడెరిగియున్నాడు. మానవులందరు దేవుని యొద్దకు రావాలని, ఆయనను ప్రేమించాలని ఆయన కోరుచున్నారు. అయితే బలవంతాన్ని బట్టిగాక, తమ యిష్టపూర్వకంగానే వారట్లుచేయాలని ఆయన కాంక్షించుచున్నారు. దేవుడు మానవుని స్వేచ్ఛను భంగపరచడు.

**మానవుడు అంతరాత్మను లేక మనసాక్షిని కలిగినవాడు**

ఈ లక్షణము కూడ అతనిని జంతువుల నుండి వేరుచేయును. ఈ మనస్సాక్షి, లేక అంతరాత్మను దేవుడే తనకు సాక్షిగా మనలో యుంచాడు. అందువలన మన తలంపులు, చేష్టలు దేవుని సన్నిధిలో మంచివో లేక చెడ్డవో మన అంతరాత్మయే మనకు బోధించును. అపొ.పౌలు అన్యజనులను గూర్చి యిట్లు చెప్పాడు: "ధర్మశాస్త్రము లేని అన్యజనులు స్వాభావికముగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలను చేసిన యెడల వారు ధర్మశాస్త్రము లేని వారైనను తమకు తామే ధర్మశాస్త్రమైనట్టున్నారు. అట్టి వారి మనస్సాక్షి కూడ సాక్ష్యమిచ్చుచుండగను, వారి తలంపులు ఒకదాని మీద ఒకటి తప్పు మోపుచు లేక తప్పులేదని చెప్పుచుండగను ధర్మశాస్త్రసారము వారి హృదయము లందు వ్రాయబడినట్టున్నారు" (రోమా 2:14-15).

"నా పితురాచార ప్రకారము నిర్మలమైన మనస్సాక్షితో నేను సేవించుచున్న దేవుని యెడల కృతజ్ఞుడనై యున్నాను" అని 2తిమోతి 1:3లో పౌలు చెప్పెను. అతడు యూదుల మహాసభ యెదుట నిలబడి, "సహోదరులారా, నేనే నేటి వరకు కేవలము మంచి మనస్సాక్షి గలవాడనై దేవుని యెదుట నడుచు కొంటినని" చెప్పెను(అపొ.కా 23:1). మరల అపొ.కా. 24:16లో, దేవుని యెడలను, మనుష్యుల యెడలను ఎల్లప్పుడు తన మనస్సాక్షి నిర్దోషమైనదిగా ఉండునట్లు అభ్యాసము

చేసుకొను చుండెనని అతడు చెప్పాడు.

ప్రతివాడు మంచి మనస్సాక్షి కలిగియుండాలి. ఒకనికి బోధింపబడిన దానిని బట్టి అతని మనస్సాక్షి అతని ప్రేరేపించును. అపొ.పౌలు సౌలుగా యున్నప్పుడు క్రైస్తవులను, క్రీస్తు సంఘాన్ని హింసించాడు. మంచి మనస్సాక్షి కలిగియే అట్లు చేసాడు. గాని అతడు చేయునది తప్పు అని తెలిసికొనగానే మార్పుజెంది క్రైస్తవుడయ్యాడు, "తాను సమ్మతించిన విషయములలో తనకు తానే తీర్పు తీర్చు కొనినవాడు ధన్యుడు" (రోమా 14:22).

**మానవుడు కనీనం రెండు భాగములైయున్నాడు**

ఒకటి భౌతికం, అది శరీరం. రెండవది ఆత్మీయం. అది అతని ఆత్మ. అందువలన మానవుడు చనిపోయినపుడు, "మన్నయినది వెనకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును" (ప్రసంగి 12:7). మన శరీరం ఒక గుడారం. ఆ గుడారమైన యీ నివాసము శిధిలమై పోయినను చేతిపని కాక దేవుని చేత కట్టబడి నదియు నిత్యమైనదియునైన నివాసము పరలోక మందు మనకున్నదని యెరుగుదుము. ఈ గుడారములో నున్న మనము భారము మోసికొని మూల్గుచున్నాము. ఇది తీసివేయవలెనని కాదుగాని మర్త్యమైనది జీవము చేత మ్రింగివేయబడునట్లు ఆ నివాసమును దీనిపై ధరించుకొన గోరుచున్నాము. దీని నిమిత్తము మనలను సిద్ధపరచినవాడు దేవుడే" (2కొరింథీ 5:1-5).

మానవుని శరీరము మర్త్యమైనది. అతని ఆత్మ అమర్త్యమైనది. ఈ శరీరాన్ని విడిచిన తరువాత అతడు నిత్యజీవాన్ని గాని, నిత్యనరకాన్ని గాని అనుభవించును.

----0---


**క్రీస్తు సంఘములు సమర్పించుచున్న**

**సత్యవాణి కార్యక్రమములను**

**ప్రతి శనివారం ఉదయం 6:30 గంటలకు తేజ ఛానల్‌లోను**

**చూడండి.**

# సంఘ పునాది

## (Foundation of the Church)

ఈ పాఠములో మనము సంఘ పునాదిని గూర్చి గమనించుదము, అది ఆత్మీయ మందిరమే అయినను, అన్నిటివలె అదియు కూడా ఒకదానిపై నిర్మించబడి యున్నది. అదేమిటి? అది మానవుడా, మానవ సిద్ధాంతములా, అపొస్తలులా లేక క్రీస్తా? దేని బలమయినను దాని పునాదిపై ఆధారపడి యున్నందున, ఈ ప్రశ్నకు మనము జవాబును కనుకొనుట అవసరము.

మొదటిగా, మనము పాతనిబంధనలో కొన్ని ప్రవచనములను గమనించుదము దావీదు ఇట్లనెను; "ఇల్లు కట్టు వారు నిషేధించిన రాయి మూలకు తలరాయి ఆయెను'' (కీర్తన 118:22). "ప్రభువుయైన యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. సీయోనులో పునాది రాతిని వేసినవాడను నేనే. అది పరిశోధింపబడినరాయి, అమూల్యమైన తలరాయి, బహుస్థిరమైన పునాదియైన మూలరాయియై యున్నది. విశ్వసించు వాడు కలవరపడడు" అని యెషయా ప్రకటించెను (యెషయా 28:16). ఇప్పుడు మత్తయి సువార్తలో చూచిన మనకు ఇట్లు కనబడును; "మరియు యేసు వారిని చూచి, ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి మూలకు తలరాయి ఆయెను. ఇది ప్రభువు వలననే కలిగెను. ఇది కన్నులకు ఆశ్చర్యము అనుమాట మీరు లేఖనములలో ఎన్నడును చదువలేదా?" (మత్తయి 21:42). దీనికి సమానాంతరముగ నున్న మార్కు 12:10, లూకా 20:11లను కూడ చదువుము.

పౌలు ఇట్లు వ్రాసెను: "అయితే ఇశ్రాయేలు నీతి కారణమైన నియమమును వెంటాడినను అనియమమును అందుకొనలేదు. వారెందుకు అందుకొనలేదు? వారు విశ్వాస మూలముగా కాక క్రియల మూలముగా నైనట్టు దానిని వెంటాడిరి. ఇదిగో నేను అడ్డురాతిని అడ్డుబండను సీయోనులో స్థాపించుచున్నాను; ఆయనయందు విశ్వాసముంచువాడు సిగ్గుపరచబడడు అని వ్రాయబడిన ప్రకారము వారు అడ్డురాయి తగిలి తొట్రుపడిరి'' (రోమా 9:31-33). పేతురు ఇట్లు పలికెను: "ప్రభువు

దయాళుడని మీరు రుచిచూచియున్న యెడల సమస్తమైన దుష్టత్వమును, సమస్తమైన కపటమును వేషధారణను, అసూయను, సమస్త దూషణ మాటలను మాని, క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై నిర్మలమైన వాక్యమను పాలనవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము, ఆ పాలను అపేక్షించుడి. మనుష్యులచేత విసర్జింపబడినను, దేవుని దృష్టికి ఏర్పరచబడినదియు అమూల్యమును సజీవమునైన రాయియగు ప్రభువు నొద్దకు వచ్చినవారై యేసు క్రీస్తుద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలుల నర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు మీరును సజీవమైన రాళ్ళవలె నుండి ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు" (1 పేతురు 2:1-6).

హెబ్రీయులకు వ్రాసిన లేఖకుడు ఇట్లు నుడువుచున్నాడు: "ప్రతి యిల్లును ఎవడైన ఒకనిచేత కట్టబడును; సమస్తమును కట్టినవాడు దేవుడే. ఇంటికంటే దానిని కట్టిన వాడెక్కువ ఘనత పొందినట్టు, ఈయన మోషేకంటే ఎక్కువ మహిమకు అర్హుడుగా ఎంచబడెను. ముందు చెప్పబోవు సంగతులకు సాక్ష్యార్థముగా మోషే పరిచారకుడై యుండి దేవుని యిల్లంతటిలో నమ్మకముగా ఉండెను. అయితే క్రీస్తు కుమారుడై యుండి, ఆయన యింటిమీద నమ్మకముగా ఉన్నాడు; ధైర్యమును నిరీక్షణవలన ఉత్సాహమును తుదమట్టుకు స్థిరముగా చేపట్టినయెడల మనమే ఆయన యిల్లు"(హెబ్రీ 3:3-6). ఆ యిల్లే సంఘము అని పౌలు చెప్పుచున్నాడు. దేవుని మందిరములో, అనగా జీవముగల దేవుని సంఘములో జనులేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని యీ సంగతులను నీకు వ్రాయుచున్నాను, "యెహోవా ఇల్లు కట్టించని యెడల దానిని కట్టువారి ప్రయాస వ్యర్థమే" అను సంగతిని జ్ఞాపకముంచుకొనుము (కీర్తన 127:1).

సంఘము దేనిపై నిర్మించబడెనో ఆ రాతిని గూర్చి పునాదినిగూర్చి మనము చదివిన తరువాత, మనము సహజముగ ఆ పునాది యేమిటి? అని యడుగవచ్చును. మనకు సంశయము

ఏమియు లేకుండ లేఖనములు దీనికి విపులముగా జవాబునిచ్చుచున్నవి. కొరింథులోయున్న సంఘమునకు చెబుతూ పౌలు ఇట్లనెను: "మేము దేవుని జతపనివారమై యున్నాము; మీరు దేవుని వ్యవసాయమును దేవుని గృహమునై యున్నారు. దేవుడు నాకనుగ్రహించిన కృప చొప్పున నేను నేర్పరియైన శిల్ప కారునివలె పునాది వేసితిరి, మరియొకడు దానిమీద కట్టుచున్నాడు; ప్రతివాడు దానిమీద ఏలాగు కట్టుచున్నాడో జాగ్రత్తగా చూచుకొనవలెను; ఈ పునాది యేసుక్రీస్తే" (1 కొరింథీ 3:9-11). ఈ సహోదరులకే అతడు వ్రాయుచు ఇశ్రాయేలీయులు కూడ అందరు ఆత్మ సంబంధమైన ఒకే పానీయమును పానము చేసిరని, అది యేసుక్రీస్తే యనియు అతడు వ్రాసెను. "ఏలయనగా తమ్మును వెంబడించిన ఆత్మసంబంధమైన బండలోనిది త్రాగిరి; ఆ బండ క్రీస్తే" యని అతడు దృఢముగా ప్రకటించెను (1 కొరింథీ 10:3-4).

ఈ సంగతిని ఎరిగిన తరువాత, యేసు తన సంఘమును కట్టుదును అని చేసిన వాగ్దానము మనము సంపూర్తిగ గ్రహించుకొనగలము. పేతురుతోను, మిగిలిన అపొస్తలులతోను, ఆయనే సజీవుడైన దేవుని కుమారుడగు క్రీస్తు అని వారు ఒప్పుకొనిన తరువాత, ఆయన యిట్లనెను: "సీమోను బర్‌యోనా, నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనే కాని నరులు నీకు బయలుపరచలేదు. మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును. పాతాళలోకద్వారములు దానియెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను" (మత్తయి 16:17,18). ఆ బండ క్రీస్తే యని, ఆయన స్థిరమైన పునాదియని మనము తెలిసికొనినట్లయితే, నిజానికి సంఘమును ఆయనపైన లేక పేతురు ఒప్పుకొనిన రీతిగా ఆయన దేవుని కుమారుడై యున్నాడని గొప్ప సత్యముపైన నిర్మింపబోవుచున్నాడని మన మెరుగుదుము. పేతురు ఒక గొప్ప నాయకుడైనను ప్రభువు సంఘమును అతనిపైగాని లేదా వేరొక మనష్యునిపైగాని నిర్మించియుండలేదు. ఆయన అట్లు చేసినయెడల పేతురు పడిపోగానే, సంఘముకూడ పడిపోవును

గాని సంఘము దేనికి తావు ఇయ్యనట్టియు, పడిపోనట్టియు దానిపై నిర్మించబడవలెను. అది నేటివరకును క్రీస్తుపైనే ఆధారపడియున్నది.

సీయోనులో అనగా యెరూషలేములో ముఖ్యమైన మూలరాయి వేయబడునని చేయబడిన ప్రవచనమును ముందే మనము చదివియుంటిమి. ఇంతకుముందు చదివిన పాఠములలో సంఘము యెరూషలేములో ఎట్లు ఆరంభమాయెనో తెలిసికొంటిమి (అపొ.కా.2). అటుతరువాత యెరూషలేము నాయకులతో పేతురు మాటలాడుచు ఆ మూలరాయి క్రీస్తే అని గుర్తించెను. అతడిట్లనెను: "మీరందరును ఇశ్రాయేలు ప్రజలందరును తెలిసికొనవలసిన దేమనగా, మీరు సిలువవేసి నట్టియు, మృతులలో నుండి దేవుడు లేపినట్టియు నజరేయుడైన యేసుక్రీస్తునామముననే వీడు స్వస్థతపొంది మీయెదుట నిలుచుచున్నాడు. ఇల్లు కట్టువారైన మీరు తృణీకరించిన రాయి ఆయనే. ఆ రాయి మూలకు తలరాయి ఆయెను. మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెనుగాని, ఆకాశముక్రింద మనుష్యులలో ఇయ్యబడినమరి ఏనామమున రక్షణ పొందలేము" (అపొ.కా4:10-12). క్రీస్తు పునాదిరాయి మాత్రమేగాక అతి ప్రాముఖ్యమైన మూలరాయి అయ్యున్నాడని పేతురు చెప్పుట గమనించుము. దేవుని మందిరమైన సంఘమునకు ముఖ్యమైన మూలరాయిగా క్రీస్తు ఉండగా, ప్రవక్తలును, అపొస్తలులును వారు చేసిన బోధలవలన ఆ పునాదిలో ఎట్లు భాగస్తులై యుండిరో పౌలు చెప్పుచున్నాడు: "కాబట్టి మీరికమీదట పరజనులును, పరదేశులునై యుండక, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును, దేవుని యింటివారునై యున్నారు. క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును, ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడి యున్నారు. ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి, ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయముగుటకు వృద్ధి పొందుచున్నది. ఆయనలో మీరుకూడ ఆత్మమూలముగా దేవునికి నివాస్థలమై యుండుటకు కట్టబడుచున్నారు" (ఎఫెసీ 2:19-22).

సరియైన పునాదియొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పుచు క్రీస్తు ఇట్లు బోధించెను: "కాబట్టి యీ నామాటలు విని వాటి చొప్పున చేయు ప్రతివాడును బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును. వానకురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెనుగాని పునాది బండమీద వేయబడెను గనుక పడలేదు. మరియు యీ నా మాటలు విని వాటి చొప్పున చేయని ప్రతివాడు ఇసుక మీద తన యిల్లుకట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెను, అప్పుడది కూలబడెను; దాని పాటు గొప్పదని చెప్పెను" (మత్తయి 7:24-27). నీవు దేనిపై నిర్మించుచున్నావు? ప్రభువు సంఘమునకు బండయైన, ముఖ్యమైన మూలరాయియైన, పునాదియైన క్రీస్తుపై నిర్మించగోరుచున్న యెడల ఆయన మాటలను విని వాటి ప్రకారము చేయవలెను. నీవు అట్లు చేసినప్పుడు ప్రభువు నిన్ను రక్షించి తన సంఘమందు నిన్ను చేర్చుకొనును. నిశ్చలమైన క్రీస్తు యేసు అను పునాదిపై ఆధారపడియున్న ప్రభువు యొక్క గృహములో భాగస్థునిగా నిన్ను చేయును (మార్కు 16:16; అపొ.కా. 2:47; 1 పేతురు 2:5).

ప్రకటన గ్రంథ ప్రసంగ మాలిక - 17

# ప్రకాశించుచున్న స్త్రీ
## (The Radiant Sixe)

**ఉపోద్ఘాతము :**

ప్రకటన గ్రంథములో మొదటి పదకొండు అధ్యాయములు భూలోక దృక్కోణముతో వీక్షించబడెను గాని 12 నుండి 24 వరకు యున్న అధ్యాయములు పరలోక దృక్కోణముతో వర్ణించబడెనని చెప్పుకోవచ్చును.

*12వ అధ్యాయు ప్రారంభముతో ప్రకటన గ్రంథము యొక్క చివరి అంకములో మనం ప్రవేశిస్తాము.

*ఈ చివరి అంకము లేకపోయినా, ప్రకటన గ్రంథము పరిపూర్ణమే.

*మొదటి భాగము యొక్క వర్తమానము,

క్రీస్తు ఆయంస సంఘంము విజేయులవుతారు.
*ఇప్పుడు 12వ అధ్యాయమును పూర్తిగా చదువుము.

**ప్రకాశమానమైన స్త్రీ:** (12:1-6). మొదటి వచనములోనే ఒక సూచన కనబడ్తాది. ఈ సూచన పరలోకంలో కనబడెనని గమనించుము.

*ఈ మొదటి సూచన ఏదనగా సూర్యుని ధరించుకొనిన ఒక స్త్రీ. ఆమె పాదముల క్రింద చంద్రుడును శిరస్సు మీద 12 నక్షత్రముల కిరీటముండెను.

*ఈమె మరియ యని అనేకులు భావిస్తారు. గాని ఈ వర్ణన ఆమెను గూర్చినది కాదు.

*ఈ దృశ్యము నర్ధము చేసికొనుటకు ఆది.కా. 37:9-10 చదువుము. అక్కడ యోసేపు తన తల్లిదండ్రులను గూర్చి అన్నలను గూర్చి కనినకల యుండును.

*సూర్యుడు చంద్రుడు నక్షత్రములు వచ్చి అతనికి నమస్కారము చేయుచున్నట్లు అతడు కల కనెను. యోసేపు యొక్క తండ్రి యాకోబు, అతని పేరు ఇశ్రాయేలుగా మార్చబడెను.

*ఇశ్రాయేలు సూర్యునివలెను, అతని భార్య రాహేలు చంద్రుని వలెను, అన్నదమ్ములు నక్షత్రముల వలెను ఆ కలలో మనకు కనిపించుదురు. అంటే సూర్య చంద్ర నక్షత్రములు ఇశ్రాయేలీయులను సూచించుచున్నవి.

*నిజానికి దేవుని ప్రజలు ఇక్కడ ఒక స్త్రీగా వర్ణించబడిరి. "ఆ స్త్రీ గర్భిణియై ప్రసవ వేదన పడుచు నొప్పులకు కేకలు వేయుచుండెను".

*పాతనిబంధనలో ఇశ్రాయేలీయులు తరుచు ఒక స్త్రీగా వర్ణించబడిరి. యెషయా 26:17; 66:7-8; మీకా 5:2-3 చదువుము.

*మీకా ప్రత్యేకముగా యేసుక్రీస్తు జననమును గూర్చి ప్రవచించాడు. మత్తయి 2:4-6 మీకా యొక్క ప్రవచన నెరవేర్పున్ను గూర్చి చెబుతాది. ఇశ్రాయేలీయుల యూదా గోత్రము ద్వారా మెస్సీయ ఈలోకంలో ఉద్భవించారు.

*ప్రకటన గ్రంధములో మనకు కనబడు స్త్రీ, పాతక్రొత్త నిబంధనలో యున్న దేవుని ప్రజలందరికి గురుతు.

*ఆ స్త్రీ కనిన శిశువు యేసుక్రీస్తు యనుట నిస్సందేహము. కీర్తనలు 2:9లో చెప్పబడిన ప్రవచనము క్రీస్తులో నెరవేరినట్లు ప్రకటన 12:5 చెప్పుచున్నది.

**పరలోక మందుకనబడిన ఇంకొకసూచన :**

*ఇదిగో యెర్రని ఘటసర్పము!

*సందర్భాన్ని బట్టి యిది సాతానుడని మనం గ్రహించుకోవచ్చు (9వ

వచనం).

*దానికున్న ఏడు తలల మీద ఏడు కిరీటములుండెను. ఆ యేడు తలలు "ఆ స్త్రీ కూర్చున్న యేడు కొండలు" (ప్రకటన 17:9). అంటే యిది రోమా సామ్రాజ్యము.

*ఆ ఘట సర్పమునకు 10 కొమ్ములుండెను. "ఆ పది కొమ్ములు పదిమంది రాజులు" (17:12).

*నిజానికి ఇక్కడ రోమా సామ్రాజ్యము దాని పాలకులు వర్ణించబడి యున్నారు.

*సాతానుడు నక్షత్రములలో మూడవ భాగమును తన తోకతో ఈడ్చిపడవేసెను. దానికున్న శక్తి అట్టిది. సాతానుడు దేవుని సన్నిధి నుండి పడిపోయినప్పుడు వానితో అనేక దూతలను కొనిపోయెను! (12:9).

*ఆ మహా ఘట సర్పము స్త్రీ కనగానే ఆ శిశువును మ్రింగివేయవలెనని స్త్రీ యెదుట నిలుచుండెనని గమనించుము.

*బాలుడైన క్రీస్తు జన్మించగానే ఆయనను చంపించాలని అపవాది చేసిన ప్రయత్నం మత్తయి 2లో యున్నది.

*క్రీస్తును శోధనల ద్వారా నాశనం చేయాలని అపవాది చేసిన ప్రయత్నం లూకా 4లో యున్నది. మరల గెత్సెమనె వనంలో ఆయనను నాశనం చేయాలని అతడు ప్రయత్నించాడు. ఆయన చెమట రక్తపుబిందువులవలె యగునంత మట్టుకు ప్రభువు ఆవేదన పడెను (మత్తయి 26).

*గాని సాతానుడు క్రీస్తును నాశనం చేయలేకపోయాడు. ప్రభువు "దేవుని యొద్దకును ఆయన సింహాసనము నొద్దకును కొనిపోబడెను" సాతానుడు ఆయనను ముట్టుకోలేక పోయాడు.

*సాతానుడు సంఘాన్ని కూడ నాశనం చేయలేకపోయాడు. ఇశ్రాయేలీయులు 'ఐగుప్తును వీడుట స్త్రీ అరణ్యమునకు పారిపోయెనను టలో' ఇమిడి యున్నది. క్రీస్తు జన్మించగానే యోసేపు మరియలు ఐగుప్తుకు పారిపోయిరి. క్రీ॥శ 70లో యెరూషలేము నాశనము గావించబడుచుండగా సంఘము పెల్ల అనే అరణ్య గ్రామమునకు పారిపోయిరి. దీనియంతటిని బట్టి దేవుడు సంఘమును కాపాడుచున్నాడని తెలియ జేయబడుచున్నది. సంఘము స్థాపించబడి భూలోకమంతా వ్యాప్తిజెందుచున్న సమయంలో ఆయన కాపుదల అత్యవసరం (కొలస్స 1:23). దేవుడు తన ప్రజలను ఎల్లవేళలా సంరక్షించారు, పోషించారు.

**పరలోకంలో యుద్ధము** (12:7-12).

*ఈలోకం ఆరంభము కాకముందు అప్పటికి దేవుని దూతగా యున్న

సాతానుకు దేవునికి మధ్యజరిగిన సంఘర్షణ యిది.

*యెహెజ్కేలు 28:11-17; యెషయా 14:12-20; 2పేతురు 2:4; యూదా 6; లూకా 10:18; 1తిమోతి 5:6; యోహాను 12:31 చదవండి.

*ఈ యుద్ధము మిఖాయేలుకు సాతానుకు మధ్యజరిగెను. మిఖాయేలు దేవుని ప్రధాన దూత. మిఖాయేలు అనగా దేవుని వంటివాడని యర్థము. ఆయన దేవుని ప్రజల పక్షమున నిలుచువాడు (దానియేలు 12:1).

*ఆ యుద్ధములో ఆఘట సర్పమును దాని దూతలును గెలువ లేకపోయిరి గనుక పరలోకమందు వారికిక స్థలము లేకపోయెను. వారు భూమి మీద పడద్రోయబడిరి.

*ఆ ఘటసర్పము అపవాది,సాతాను అను పేరు గలవాడు.

*అది ఆదిసర్పము. ఆది కాండము 3వ అధ్యాయములో వాడు మనకు కనబడును.

*అపవాది అనగా నేరము మోపువాడు, మోసపుచ్చువాడని యర్థము(10వ).

*సాతాను అనగా ప్రతివాది అని యర్థము. యోబు గ్రంధము మొదటి రెండు అధ్యాయములు చూడుము.

*అతడు సర్వలోకమును మోసపుచ్చువాడు. సువార్తవెలుగును చూడకుండా అతడు మనుష్యుల మనో నేత్రములకు గ్రుడ్డి తనము కలుగజేయును (2 కొరింథీ 4:4). అతడు మారు వేషము వేసికొంటాడు. అందులోనేర్పరి (2కొరింథీ 11:14-15). అతడు అబద్ధికుడు, దాని జనకుడు (యోహాను 8:44).

*అయితే శుభవార్త యేమనగా, పరిశుద్ధులు అతనిని జయించగలరు. వారు క్రీస్తురక్తము ద్వారా వానిని జయించగలరు (ప్రకటన 1:5; హెబ్రీ 9:14; 1యోహాను 1:7).

*క్రైస్తవులు తామిచ్చిన సాక్ష్యము బట్టి వానిని జయించియున్నారు. వారు క్రీస్తునందు విశ్వాసముంచి, ఆయన నామమును ఒప్పుకొనుచు, సర్వలోకానికి సువార్త ప్రకటించుచు జయిస్తారు (రోమా 10:17;10:9-10;మార్కు 16:15-16). యోహాను తానిచ్చిన సాక్ష్యము నిమిత్తము పద్మాసులో పరవాసియై యుండెను.

*చివరిగా క్రైస్తవులు 'మరణము వరకు తన ప్రాణములను ప్రేమించిన వారు కారు' గనుక సాతానును ఓడిస్తారు. మరణము వరకు మనం నమ్మకముగా యుండాలని క్రీస్తు చెప్పెను. అప్పుడు నిత్యజీవ కిరీటము ఇయ్యబడును (ప్రకటన 2:10). స్తెఫను, యాకోబు,

అంతిపయులు తమ ప్రాణములను ప్రేమించిన వారు కారు (అపొ.కా. 7:12; ప్రక 2).

❋పరిశుద్ధులు విజేయులవుట వలన పరలోకములో గొప్ప ఉత్సాహము కలుగును. కాని భూమికి శ్రమ. సాతానుడు గాయం వరచబడిన సింహము వలెయున్నాడు. వాని సమయము సంకుచితమే యని ఎరిగి అనేకులను తనతో నాశనమునకు కొనిపోవలెనని క్రోధముగలవాడై భూమికి దిగివచ్చాడు!

**భూమిపై సాతాను యుద్ధము : (12: 13-17).**

❋13వ వచనంలో సంఘము హింసింపడుట చూస్తాము. 2తిమోతి 3:12; యోహాను 15:20.

❋గాని క్రీస్తు సంఘమును సంరక్షించును. సంఘమును రెక్కలమీద ఆయన అరణ్యమునకు కోనిపోయెను. సాతాను నుండి సంఘమునకు హానికలుగ కుండ దానిని ఆయన పరిరక్షిస్తారు (నిర్గమ 19:4 చూడుము).

❋హింసింపబడినా, చంపబడినా, సంఘము కొనసాగుచునే యుండును.

❋సంఘమును నాశనం చేయాలని సాతాను తన నోటి నుండి నీళ్లు నదీ ప్రవాహమువలె వెళ్ల గ్రక్కెను.

❋దేవుని ప్రజలను నాశనం చేయడానికి అపవాది నోటి నుండి వచ్చునదేమిటి?

❋అది హింస, మోసము, అబద్ధ బోధ మొ॥నవి.

❋అబద్ధము,మోసముఅబద్ధబోధలను ప్రవాహమువలె భూప్రజలపైకి అది ప్రయోగించును. ఈ లోకస్థులు వాటిని ఇట్టే మ్రింగివేయుదురు. అబద్ధ సిద్ధాంతములు నంగీకరించు వారికి దేవుని ప్రజలకు మధ్య వ్యత్యాసము స్పష్టముగా కనబడును.

❋అందుచేత ఆఘటసర్పము ఆగ్రహము తెచ్చుకొని యేసును గూర్చి సాక్ష్యమిచ్చుచున్న వారైన దేవుని ప్రజలతో యుద్ధము చేయును (17వ).

**ముగింపు :**

అవును సాతానుడు నీతో యుద్ధము చేయును. వాడు క్రీస్తును నాశనం చేయలేక పోయాడు, ఆయన సంఘమును నాశనం చేయలేకపోయాడు. గనుక నిన్ను నాశనం చేయజాస్తాడు.

అయితే సాతానుడు ఓడిపోతాడు. 12వ అధ్యాయం యొక్క వర్తమానం అదే. నీవు క్రీస్తుకు నమ్మకముగా యుంటే తప్పక విజయం సాధిస్తావు. విజయం మనదే!

బైబిలు సర్వే -4

# సృష్టి - మానవ పతనము

ఏ కధనైనా ప్రారంభమునుండి మొదలు పెడితే చాలా బాగుంటుంది. బైబిలు నందు కూడా అలానే మొట్టమొదటి నుండి కధ ప్రారంభమైనది. కనుకనే బైబిలు నందలి మొదటి గ్రంధమునకు ఆది కాండము అని పేరు పెట్టబడినది. ''ఆది'' యనగా మొదట లేక ప్రారంభమున యని అర్ధము. బైబిలు నందలి మొట్టమొదటి అధ్యాయము మొట్టమొదటి వచనము ఈలాగు వ్రాయబడినది. "ఆది యందు దేవుడు భూమి యాకాశములను సృజించెను" (ఆది 1:1). ఈ వచనమునందు ఆదియందు దేవుడు వున్నాడని రుజువుచేయుటకు ప్రయత్నించలేదు. మానవులు సాధారణముగా పరమాత్మునియందు (సర్వోన్నతుని యందు) నమ్మిక వుంచుదురు. బైబిలు నందలి గ్రంధకర్తలు ఆయునను గరించి రుజువు పర్చు విషయములో ఎక్కడ సమయమును వృధా చేయలేదు. ఎందుకనిన కనీస జ్ఞానము కలవాడు కూడా పరమాత్ముని నమ్ముట కష్టముకాదు. కనుకనే కీర్తనల గ్రంధకర్త కీర్తన 19:1లో ఈలాగు వ్రాయుచున్నాడు, "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచుర పరచుచున్నది".

## సృష్టి దినములు

సృష్టి ఎప్పుడు జరిగిందో మనకు చెప్పబడలేదు. ఐన ప్రారంభము గూర్చి తెలుసు కోనుటవల్ల ప్రయోజనములేదు. కాని మనకు తెలిసిందల్లా దేవుడు భూమిని సృజించినపుడు అది నిరాకారముగాను శూన్యముగాను వున్నది. ఈ స్థితిలో భూమి ఎంతకాలమున్నదో మనకు తెలియదు. కానీ కొంతకాలానికి దేవుడు ఈభూమిని ప్రస్తుతం మనం చూస్తున్న స్థితిలోనికి తెచ్చాడు. మొదటి దినాన్న ఆయన వెలుగు సృజించి రాత్రి పగలు కలుగ జేసెను. రెండవ దినమున దేవుడు ఆకాశ విశాలమును కలుగ జేసెను. దానికి ఆకాశమని పేరు పెట్టెను. తరువాత దినములలో ఆయన సూర్య చంద్ర నక్షత్రములను సృజించెను. ఆఖరుగా 6వ దినమున ఆయన తన స్వరూపమందు దేవుడు మానవుని సృజించెను. 7వ దినమున తనపనినుండి ఆయన విశ్రమించెను.

## మానవుని పతనము

దేవుడు మొట్టమొదటి మానవుడైన ఆదామును ఏదేను అను సుందరమైన

వనమందుంచెను. ఆదాము వంటరిగా వుండుట మంచిది కాదని దేవుడు అతనికి గాఢనిద్ర కలుగజేసి ప్రక్కనుండి ఎముకను తీసి ఒక స్త్రీని తయారుచేసెను. దేవుడు ఆస్త్రీని ఆదామునకు భార్యగా అనుగ్రహించెను. ఆదాము ఆమెకు 'హవ్వ' అని పేరు పెట్టెను ఏలయనగా ఆమె జీవించువారి తల్లి. ఏదెను తోటను కాయు బాధ్యతను దేవుడు ఆదామునకు అతని భార్యకు అప్పగించెను. కాని దానిలోవున్న మంచి చెడ్డల జ్ఞానమునిచ్చు చెట్టు ఫలమును తినకూడదని షరతు పెట్టెను. నీవు వాటిని తినుదినమున నిశ్చయముగా చచ్చెదవు.(ఆది 2:17). కానీ ఒక రోజున (మాట్లాడగల) ఒక సర్పము హవ్వ దగ్గరకు వచ్చి దేవుడు తినకూడదని చెప్పిన ఫలము తినిన చావవని చెప్పెను. ఇది బైబిలునందు రికార్డు చేయబడిన మొదటి అబద్ధము హవ్వ అదినమ్మి కొన్ని పండ్లు తిని కొన్ని పండ్లును తన భర్తకు యిచ్చినది. అతడు కూడతినెను. వెంటనే వారికి మంచి చెడ్డల జ్ఞానము కలిగి తాము దిగంబరులని గ్రహించి దేవునికి కనబడకుండా దాగుకొనిరి, ఇది మానవుడు చేసిన మొదటి తప్పు. 1 యోహాను 3:4 నందు ఆజ్ఞాతి క్రమమే పాపమని చెప్పబడినది. ఆదాము హవ్వ అవిధేయంతతో దేవుని ఆజ్ఞను అతిక్రమించారు, పాపంచేశారు.

వారు పాపం చేశారు కాబట్టి దేవుడు వారిని అనేక విధాలుగా శిక్షించారు. ఏదేను తోటలోనుండి వారు గెంటి వేయబడ్డారు. స్త్రీ బాధతో ప్రసవించుట అనే శిక్షపొందింది. శ్రమపడి ముండ్ల పొదలను నరికి తన ఆహారము సిద్ధము చేసుకొనుటకు పని చేయవలసిన శిక్ష పొందాడు పురుషుడు. వీటన్నిటికన్నా ముఖ్యమైన శిక్ష 'మరణము'మానజాతి యంతటికి సంప్రాప్తమైనది. ఆ రోజునుండి నేటివరకు హానోకు, ఏలియాలు తప్ప అందరూ శారీరిక మరణమును పొందారు. ఇంతే కాకుండా ఆత్మీయమరణము శాశ్వతంగా దేవుని నుండి ఎడబాటు ఆదాము హవ్వ పాపం చేసిన దినం నుండి మానవులకు సంప్రాప్తమైనది.

మన తల్లిదండ్రుల నుండి మానవ బలహీనతలను మనం పొంది కాలక్రమమున అవియే పాపానికి కారణమవుతాయి. కానీ వారి దోష శిక్షను మనం అనుభవించము. ఎందుకంటే "మనలో ప్రతీవాడు తన్ను గురించి దేవునికి లెక్క యప్పగించు కోవాలేకాని మనలను కన్న వారి పాపాలకు కాదు. మనమందరము పాపం చేశాము కాబట్టే దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవుచున్నాము (రోమా 3:23). కనుకనే మనలను పాపమునుండి రక్షించి దేవునితో పాటు నిత్యత్వంలో మనలను

చేర్చుటకు క్రీస్తు ఎంతైనా అవసరం . ఇంకో పాఠములో ఇది ఇంకా నిపులంగా చదువుకొందాం.

ఆదాము హవ్వలకు పుట్టిన మొట్టమొదటి ఇద్దరు కుమారులు కయీను హేబెలు. ఒక రోజు కయీను తన సహోదరుడైన హేబేలును కోపముతో చంపాడు. ఇది మొట్టమొదటి నరహత్య. తన పాప ఫలంగా కయీను తన ప్రజలనుండి దూరం చేయబడ్డాడు. ఆ తరువాత ఆదాము హవ్వలకు చాలామంది సంతానం కలిగారు (ఆది 5:4). వారు వారిలో వారినే వివాహం చేసుకొని సంతానాభివృద్ధి చేసుకొన్నారు. తరువాత జరిగిన సంగతులను గురించి వ్రాయబడలేదు. కానీ భూమిమీద జనం విస్తారంగా అభివృద్ధి చెంది పాపం చేయుట ద్వారా మానవులు దేవునివిడిచిరని మాత్రం వ్రాయ బడ్డాది. ఆరోజుల్లో మానవులు చాలా దీర్ఘ కాలం జీవించే వారు. 969 సంవత్సారాలు మెతుషలా జీవించి అందరికన్నా ఎక్కువకాలం బ్రతికినట్లు బైబిలు చెప్పుచున్నది, ఆదాము 930 సంవత్సరాలు బ్రతికాడు.

**జలప్రళయం**

మానవుని దుష్టత్వం దేవుని చాలా బాధించినందున మానవుని నాశనం చేయాలని దేవుడు నిర్ణయించుకొన్నాడు. నోవహు ఒక్కడే ఆరోజుల్లో నీతిమంతుడు. ఆయన గూర్చి పేతురు తన పత్రికలో "నీతినిగూర్చి బోధించువాడు" (2 పేతురు 2:5) అని వ్రాసెను. "అతడు నీతిమంతుడు కనుక దేవుడతనిని కుటుంబమును రక్షించుటకు నిర్ణయించుకొనెను. దేవుడు నోవహుకు ఖచ్చితమైన కొలతలను కట్టును చెప్పి ఓడ కట్టుమని అజ్ఞాపించెను. దేవుడు ఆజ్ఞాపించిన రీతిగా నోవహు పెద్ద ఓడను కట్టెను. నోవహు జలప్రళయము నుండి రక్షింప బడుటకు దేవుడు చెప్పినవిధముగా ఓడకట్టుట ఎంత ప్రాముఖ్యమైన విషయమో ఈనాడు మనము కూడా దేవుడు ఆజ్ఞలు అనుసరించుట అంతే ప్రాముఖ్యమైన విషయము. ఓడ నిర్మాణము పూర్తి ఐన తరువాత దేవుడు నోవహుతో పవిత్రమైన జంతువులనుండి ఏడేసి జతలను లోనికి తెమ్మనెను. పవిత్రము కాని జంతువులను ఒక్కొక్క జతనులోనికి తెమ్మనెను. ఒక్కోసారి ప్రజలు ఓడ సైజు విషయములో అనుమానించు చుందురు. నిజముగా దానియందు ప్రపంచములోని ప్రతీ జాతిలోనుండి తీసినవి ఓడలో సరిపోవునా లేదా? వాస్త వానికి ఓడయందు స్థలం సమృద్ధిగావున్నది. ఎందుకంటే దాని పొడవు 300 మూరలు 50మూరలు వెడల్పు మూడు అంతస్తుల ఎత్తు (అనగా 450 అడుగుల పొడవు 75

అడుగుల వెడల్పు).

అంతయూ సిద్ధమైన తరువాత నోవహు అతని భార్య అతని 3 కుమారులైన శేము, హాము, యాఫెతు మరియు అతని 3 కోడండ్రు దానిలో ప్రవేశించిన తరువాత వర్షం ప్రారంభమై భూమియంతా వరదలలో మునిగిపోయింది. ఓడలో వున్న వారే రక్షించబడ్డారు. బాప్తిస్మము ద్వారా రక్షణ పొందుదురను దానిని చెప్పిన సందర్భమున నోవహు గురించి ఈలాగు వ్రాశాడు. "దేవుని దీర్ఘశాంతము ఇంకా కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడు చుండగా, ఆ ఓడలో కొందరు అనగా 8 మంది నీటిద్వారా రక్షణ పొందిరి. దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది (1 పేతురు 3:20-21).

150 రోజులవరకు నీరు భూమి మీద వుంది (ఆది 7:24). ఆతరువాత ఓడ అరారాతు పర్వతం మీద ఆగింది. వారు 8 మంది ఓడలోనికి వెళ్ళి 1 సంవత్సరం 10 రోజులు వున్న తరువాత బయటికి భూమి మీద కాలుపెట్టి దేవునికి బలియర్పణ అర్పించారు. దేవుడు ఇక ఎన్నడూ భూమిని జలము ద్వారా నాశనం చేయనని వాగ్దానం చేసి ఆకాశంలో ఇంద్రధనస్సును గుర్తుగా యిచ్చాడు.

జలప్రళయము దానిముందునున్న కాలమును అంతమొందించింది. జలప్రళయము తరువాత వేరొక కాలము ప్రారంభమయినది.

జలప్రళయము తరువాత నోవహు సంతానము విడిపోదుమనెడి భయములో ఆకాశమునంటు ఒక గోపురము బాబెలు నందు నిర్మింపతల పెట్టిరి. ఇది దేవుని దృష్టికి ఇష్టము కానందున వారి భాషలుతారు మారు చేసెను. కనుక వారు ఒకరిని ఒకరు అర్ధము చేసుకొన లేక పోయిరి.

అందువలన వారు విడిపోయి పలుదిశలకు వెళ్ళిపోయి నట్లు దేవుడు చెసెను. యాఫేతు కుమారులు ఉత్తర దిశగా పోయిరి. యూరపు అమెరికా ప్రజలలో చాల మంది యాఫేతు సంతతి వారు. హాము సంతానము కనెను. ఈజిప్టు మొదలగు దేశములలో స్థిరపడ్డారు. షేము సంతానము నుండియే యూదులు వచ్చిరి. యేసు క్రీస్తు షేము సంతానము నుండియే వచ్చెను. ఈ వృత్తాంత మంతయూ బాగుగా అర్ధము కావలయునన్న ఆదికాండము నందలి మొదటి 7 అధ్యాయములను చదువుము.

# మీ దేవుని సన్నిధిని కనబడుటకై సిద్ధపడుడి

## (Prepare to Meet Thy God)

ప్రవక్తయైన ఆమోను ఇశ్రాయేలీయులతో ఇట్లనెను: "ఇశ్రాయేలీయులారా, మీ దేవుని సన్నిధిని కనబడుటకై సిద్ధపడుడి"(ఆమో 4:12). దేవునితో ఎవడైనను సమాధాన పడాలంటే దేవుని షరతుల చొప్పుననే సమాధానపడాలి. సొలొమోను ఇట్లన్నాడు: "ఒకని యెదుట సరియైనదిగా కనబడ మార్గము కలదు. అయితే తుదకు అది మరణమునకు త్రోవతీయును" (సామె 14:12).

అచంచలమైన దేవుని వాక్యమును గూర్చి బోధించుచు యేసు ప్రభువు: "నేనే మార్గమును సత్యమును జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని చెప్పెను (యోహాను 14:6; 12:48-49). మనము సత్యాన్ని నమ్మి దాని ప్రకారము ప్రవర్తించని యెడల మన భక్తి సహజముగా సద్భక్తి కానేరదు.

అపొస్తలుడైన పౌలు తన జీవితాన్ని ఒకమారుజ్ఞప్తికి తెచ్చు కొనుచున్నాడు. అప్పుడతడు క్రైస్తవులను గొప్ప ఆసక్తితో హింసించాడు. అయితే తాను చేయునదంతయు వ్యర్థమే యని గ్రహించి మారుమనస్సు పొందినవాడై, "సహోదరులారా, నేను నేటి వరకు కేవలము మంచి మనస్సాక్షి గలవాడనై దేవుని యెదుట నడుచుకొంటినని చెప్పెను" (అపొ.కా. 23:1). "నజరేయుడైన యేసు నామమునకు విరోధముగా అనేక కార్యములు చేయవలెనని నేనుకొంటిని; యెరూషలేములో నేనాలాగు చేసితిని" అని అతడు మరల చెప్పాడు (అపొ.కా. 26:9). "పూర్వము దూషకుడను, హింసకుడను, హానికరుడనైన నన్ను తన పరిచర్యకు నియమించి నమ్మకమైనవానిగా ఎంచినందుకు, నన్ను బలపరచిన ప్రభువైన క్రీస్తు యేసుకు కృతజ్ఞుడనై యున్నాను. తెలియక అవిశ్వాసము వలన చేసితిని గనుక కనికరింపబడితిని" యని అతడు తిమోతికి వ్రాసాడు (1తిమోతి 1:12-13).

సత్యమునకు లోబడుట వలన ఆత్మలు పవిత్ర పరచబడును. "మీరు సత్యమునకు విధేయులవుట చేత మీ మనస్సులను పవిత్ర పరచుకొనినవారై

యుండి, యొకని నొకడు హృదయ పూర్వకముగాను, మిక్కుటముగాను ప్రేమించుడి'' యని పేతురు చెప్పుచున్నాడు. (1పేతురు 1:23).

ఆత్మ మనలను పరిశుద్ధపరచుట వలన, సత్యమును నమ్ముట వలనను మనము రక్షణ పొందియున్నాము. అందుకై దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లింపబద్ధులమైయున్నాము (2థెస్స 2:13).యేసు ఇట్లనుచున్నాడు: "మీరు నా వాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 8:31-32).

పరిశుద్ధ లేఖనములు రక్షణార్థమైన జ్ఞానమును మనకు కలిగించును. మరియు "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, తప్పు దిద్దుటకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:15-17).

ఈ పాపపు లోకమునుండి దేవుని కుమారుని నిత్య రాజ్యములో ప్రవేశించాలంటే నీవు యేసుప్రభువు నందు విశ్వాస ముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము, యేసే ప్రభువని మనుష్యుల యెదుట ఒప్పుకొనుము. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. దయచేసి ఈ దిగువ వాక్యములను దేవుని గ్రంధమందు చదువుము: మార్కు 16:16; యోహాను 3:1-6; అపొ.కా. 2:29-47; రోమా 6:1-6; గలతీ 3:26-29; మత్తయి 10:22; ప్రకటన 2:10.

- G.K. రెయిన్స్


సత్యవాణి - క్రీస్తు సంఘము ద్వారా ఉచితంగా ఇయ్యబడుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సులో మీరు, మీ సంఘ సభ్యులు చేరండి. ఆ పాఠములను మీయింటిలోనే పూర్తిచేసి బైబిలు జ్ఞానమును పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి.

SATYAVANI, P.O.Box-80 KAKINADA - 533 001.

గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపిచవలయును.

అక్టోబరు 29వ తేదీ సోమవారం కోరుకొండ మండలం గాదాల గ్రామంలో జరిగిన సువార్తకూటములో రిక్కీగారు వాక్యపరిచర్య చేసిరి. ఆయనతో పాటు సోదరులు వి. రాజవిజయ కుమర్, కె. మోజెస్‌గార్లు కూడ హాజరై చక్కటి దైవసందేశము లనందించిరి. గాడాలలో మూడుదినముల సువార్త కూటములలో పైనుదహరించిన సోదరులు వాక్యపరిచర్య చేసిరి. అక్కడ సోదరులు కె. రత్నరాజుగారు సువార్త చాటుచున్నారు.

2007 నవంబరు 1వ తేదీనాడు కోరుకొండలో జరిగిన కూటములో సోదరులు రిక్కీగూటంగారు వాక్యోపదేశము గావించిరి. కోరుకొండలో సోదరులు కె. మోజెస్‌గారు క్రీస్తు కొరకు బలముగా పనిచేయుచున్నారు.

నవంబరు 2వ తేదీ శుక్రవారం పాకయురావుపేట మండలం గుంటుపల్లిలో జరిగిన కూటములో సోదరులు రిక్కీగూటంగారు వాక్యపరిచర్య చేయగా నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిరి. అక్కడ సుగుణాకర్‌గారు సువార్త చాటుచున్నారు.

నవంబరు 5వ తేదీనాడు ఆర్. కొత్తూరులో రిక్కీగారు వాక్యపరిచర్య చేసిరి. అక్కడ ఎ. జీవరత్నంగారు సువార్తచాటు చున్నారు.

నవంబరు 6వ తేదీ మంగళవారం నాడు రిక్కీగారు తుని-నర్సీపట్నం ఏరియాలోను, ముఖ్యముగా సొమ్మసింత గ్రామములోను సువార్తచాటిరి. అనేకులు క్రీస్తులోనికి చేర్చబడిరి. అక్కడ డి. సుబ్బారావుగారు క్రీస్తు కొరకు శ్రమించుచున్నారు.

నవంబరు 7వ తేదీ బుధవారం సోదరులు రిక్కీగారు రాజానగరంలో యున్న క్రీస్తుసంఘ ఆలయములో వాక్కపరిచర్య చేసిరి. అనేకులు హాజరై ఆసక్తితో దేవుని వాక్యమును వినిరి. రాజానగరంలో సోదరులు యం. శ్రీహరిగారు సువార్తికునిగా పనిచేయుచున్నారు.

నవంబరు 9వ తేదీ శుక్రవారం ఆచంట మండలం పెనుమంచిలిలో జరిగిన సువార్తకూటములో రిక్కీగారు గంభీరముగా వాక్యపరిచర్యచేసిరి. నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సోదరులు యన్. మోజెస్, జి. చిట్టిబాబు, కె. ప్రసాద్ పరిసర ప్రాంతపు సువార్తికులు ఆ కూటమునకు హాజరై మంచి సహవాసములో పాలుపొందిరి. పెనుమంచిలిలో సోదరులు యం. జోసఫ్‌గారు సువార్త చాటుచున్నారు.

నవంబరు 14,15 తేదీలలో కర్నాటక, హోస్పేట పట్టణములో యున్న క్రీస్తుసంఘము నిర్వహించిన సువార్తకూటములో సోదరులు రిక్కీగూటం, మరియు జిమ్‌ప్రకాశ్‌గార్లు వాక్యపరిచర్యచేసిరి. కర్నాటకలో పలుప్రాంతముల వారు వచ్చి సత్యవాక్యమును వినిరి; గొప్ప ఆసక్తి కనుబరచిరి. హోస్పేటలో సోదరులు పి.భాస్కర్‌గారు కష్టించి సువార్త చాటుచున్నారు.

నవంబరు 28వ తేదీనాడు రిక్కీగూటంగారు,రాబిన్‌గూటంగారు థాయ్‌లాండ్ దేశమునకు ప్రయాణమైరి. అక్కడ చీంగ్‌మయి పట్టణములో జరుగుచున్న ఏషియన్ బైబిలు లెక్చర్‌షిలో ప్రసంగీకులుగా వీరిద్దరు అక్కడకు వెళ్లిరి. నవంబరు 29వ తేదీ గురువారం పెద్దాపురం మండలం గోరింటలో క్రీస్తుసంఘ ఆలయ నిర్మాణము నిమిత్తము జాషువాగూటంగారు పునాది రాయి వేసిరి. గోరింటలో సోదరులు యమ్.ప్రేమ్‌కుమార్‌గారు సువార్త పనిచేయుచున్నారు. ఈయువకుల క్షేమము కొరకు, చేయుచున్న పనికొరకు చదువరులు ప్రార్థించమనవి, డిశంబరు 10వ తేదీనాటికి రిక్కీ,రాబిన్ గార్లు స్వదేశము చేరుకొనగలరు.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:
SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004